# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 304 బుధవారం 26 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# జూలైలో కేబినేట్ విస్తరణ




- ఆ దిశగా కసరత్తు పూర్తి చేసిన రేవంత్ సర్కార్
- జూలై మొదటి వారంలోనే విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం
- కేబినెట్ విస్తరణతో పాటు నామినేటెడ్ పోస్టుల అంశంపై ఢిల్లీ పెద్దలతో చర్చించే అవకాశం ఉంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి ఈ సంఖ్య 12గా ఉంది
- మరో ఆరు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది
- వీటి కోసం పలువురు నేతలు చాలా రోజులుగా ప్రయత్నాలు
- తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం

హైదరాబాద్

తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జూలై మొదటి వారంలోనే విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అడుగు ముందుపడనుంది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కేబినెట్ విస్తరణతో పాటు నామినేటెడ్ పోస్టుల అంశంపై ఢిల్లీ పెద్దలతో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతేడాది డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టింది. ఇదే రోజు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుత కేబినెట్ లో 11 మంది మంత్రులు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి ఈ సంఖ్య 12గా ఉంది. మరో ఆరు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. వీటి కోసం పలువురు నేతలు చాలా రోజులుగా - మిగతా3లో

# సేమ్... సీన్...
## పార్టీలు మార్పు అంతే




- పార్టీ స్థిరంగా ఉండేందుకు చేరికలను ప్రోత్సహిస్తోన్న కాంగ్రెస్
- తాము బలపడతామని, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను బలహీనపరుస్తున్నామని హస్తం నేతలు భావన
- ఈ విషయంలో గతంలో కేసీఆర్ చేసిన తప్పే ఇప్పుడు సీంఎ రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్న విశ్లేషకుల అభిప్రాయం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా వారిపై ఎన్నికల్లో పోటీచేసి ఓడి పోయినవారిపై ప్రభావం

హైదరాబాద్

తెలంగాణలో బొటాబొటీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థిరంగా ఉండేందుకు చేరికలను ప్రోత్సహిస్తోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటోంది. దీంతో తాము బలపడతామని, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను బలహీనపరుస్తున్నామని హస్తం నేతలు భావిస్తున్నారు. కానీ, ఈ విషయంలో గతంలో కేసీఆర్ చేసిన తప్పే ఇప్పుడు సీంఎ రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్న - మిగతా3లో



## జూలైలో రష్యాలో పర్యటించనున్న మోదీ

- క్రెమ్లిన్‌కు చెందిన అధికారి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించినట్లు తెలిపిన రష్యాకు చెందిన ఆర్ఐఏ న్యూస్ ఏజెన్సీ
- జూలైలో మోదీ రష్యాలో పర్యటించనున్నట్లు దౌత్యవర్గాల ద్వారా వెల్లడి
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను మోదీ కలుసుకునే అవకాశాలు
- ఈ ఏడాది బ్రిక్స్ నేతల సమావేశాల్లోనూ ఇద్దరూ కలుసుకోనున్నట్లు భావన


# ముందుకు సాగని మహాలక్ష్మి?

- ప్రభుత్వ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 'మహాలక్ష్మి' పథకం ఒకటి.
- ప్రతీ మహిళకు రూ.2,500 ఆర్థిక సాయం చేయడం
- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ మహిళలకు రూ.2,500 సాయం చేస్తామని హామీ
- మొదట మహాలక్ష్మీ ప్రారంభించాలని అనుకున్నటప్పటికీ రుణమాఫీ మొగ్గుచూపించిన ప్రభుత్వం
- రైతులకు రూ.2 లక్షల వకు రుణమాఫీ చేసిన తరువాత కాంగ్రెస్ ప్రకటించిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500 సాయం చేసే యోచనలో సర్కార్




హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 'మహాలక్ష్మి' పథకం ఒకటి. ఈ పథకంలో భాగంగా తెలంగాణలోని ప్రతీ మహిళకు రూ. 2,500 ఆర్థిక సాయం చేయడం. గత ప్రభుత్వం వృద్ధులకు ఆసరా పింఛన్లు, బీడీ కార్మికులకు సాయం చేసింది. అలాగే చదువు కొని ఉద్యోగాలు చేయని వారికి నిరుద్యోగ భృతి అందిస్తామని పేర్కొంది. అయితే ఈ పథకం ప్రారంభం కాకపోవడంతో దీని స్థానంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ మహిళలకు రూ. 2,500 సాయం చేస్తానని తెలిపింది. దీంతో చాలా మంది మహిళలు ఇది అందరికీ వర్తిస్తుందని అనుకున్నారు. -మిగతా3లో



## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ

- స్టే ఎత్తివేతకు నిరాకరించిన ధర్మాసనం
- ట్రయల్ కోర్టు ఉత్తర్వు లోపభూయిష్టంగా ఉంది
- కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వొద్దంటూ కోర్టును కోరిన ఈడీ
- ఈ నెల 20న రౌస్ అవెన్యూ కోర్టు సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

# రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ చేద్దాం



- వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశం
- గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిలిపివేసిన వ్యవసాయ పథకాలపై ఆరా
- రాబోయే సీజన్‌కు పంటల భీమాకు సంబంధించి పిలవాల్సిన టెండర్లపై చర్చ
- రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాం
- అయితే వ్యవసాయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల పైన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది

హైదరాబాద్

రైతు భరోసాపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో ఈరోజు(మంగళవారం) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌలి శాఖల అధికారులతో వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు మరియు తదితరులు హాజరయ్యారు. వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు చర్చించారు. - మిగతా3లో



# ఎవరూ తొందరపడొద్దు


- బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చ
- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారు
- రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నది
- వైఎస్ హయాంలో ఇలాంటివి ఎన్ని జరిగినా భయపడలేదు
- చ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శ
- పోచారం లాంటి వారు పార్టీ మారితే వచ్చే నష్టమేమీ లేదు... వాటిని పట్టించుకోవద్దు: కేసీఆర్
- నేటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుస భేటీలు : కేసీఆర్

హైదరాబాద్

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో - మిగతా3లో

# రాహుల్ చెబుతున్న 'సంప్రదాయం' 'ఇండియా'లో కనరావడం లేదు

**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఓం బిర్లా ఏకగ్రీవంగా ఎన్నికవుతారని అంతా భావించారు. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తమ స్పీకర్ అభ్యర్థిగా కె.సురేశ్‌ను బరిలో దింపింది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఆ పదవికి రేపు ఎన్నిక జరగనుంది. అయితే లోక్‌సభ స్పీకర్ పదవి మీరు తీసుకోండి.. డిప్యూటీ స్పీకర్ పదవి మాత్రం ప్రతిపక్షానికి కేటాయించి పాత సంప్రదాయాన్ని కొనసాగించడంటూ బీజేపీ పెద్దల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపాదన చేశారు. రాహుల్ చెబుతున్న ఈ పాత సంప్రదాయంపై రాజకీయ వర్గాల్లో ఓ ఆసక్తికర చర్చ అయితే వాడి వేడిగా నడుస్తుంది. ఎందుకంటే బీజేపీ పెద్దల ముందు రాహుల్ గాంధీ పెట్టిన ఈ 'సంప్రదాయం' అనవాళ్లు



ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రంలో కానరావడం లేదనే ఓ చర్చ అయితే వైరలవుతుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, కేరళ అసెంబ్లీలలో అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లుగా కొనసాగుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలు తెలంగాణ, ఝార?ండ్‌లలో స్పీకర్‌గా ఆ పార్టీ వారే ఎన్నికయ్యారు. మరోవైపు ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్లు లేక పోవడం గమనార్హం. అలాగే పంజాబ్, ఢిల్లీలలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ యా రాష్ట్రాల అసెంబ్లీలలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు అధికార పార్టీకి చెందిన వారేనన్న విషయం అందరికీ తెలిసిందే. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో సైతం స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు హస్తం పార్టీకి చెందిన వారే కొనసాగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెబుతున్న పాత సంప్రదాయం 'ఇండియా కూటమి' ఎలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా లేదనే ఓ చర్చ సైతం హాట్ హాట్‌గా కొనసాగుతుంది.

## డిప్యూటీ స్పీకర్ పదవిపై విపక్ష డిమాండ్‌ను ప్రధాని మోదీ తిరస్కరించారు : భూపేష్ బఘేల్

లోక్‌సభ స్పీకర్ ఎన్నికపై చత్తీస్‌ఘఢ్ మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత భూపేష్ బఘేల్ స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నడూ విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోరని విమర్శించారు. డిప్యూటీ స్పీకర్‌పై విపక్ష డిమాండ్‌ను ప్రధాని తోసిపుచ్చారని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షాలకు కేటాయిస్తే ఎన్డీయే స్పీకర్ అభ్యర్థికి మద్దతిస్తామని విపక్ష నేతలు స్పష్టం చేసినా పాలక పక్షం అంగీకరించలేదని దుయ్యబట్టారు. విధిలేని పరిస్థితుల్లో స్పీకర్ ఎన్నికల్లో విపక్షం తలపడే పరిస్థితి నెలకొందని అన్నారు. కాగా ఎన్డీయే తరపున స్పీకర్ అభ్యర్థిగా ఓం బిర్లా పోటీ చేస్తుండగా విపక్షం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కే సురేష్ తలపడుతున్నారు. ఇక సీజీటీఈటీ 2024 నియామక పరీక్షకు సంబంధించి విద్యార్థులతో బఘేల్ సమావేశమయ్యారు. 400 మంది విద్యార్థుల భవితవ్యం గందరగోళంలో పడిందని, రీటెస్ట్‌కు విద్యార్థులను అనుమతించాలని కోరుతూ తాను చత్తీస్‌ఘఢ్ సీఎంకు లేఖ రాశానని చెప్పారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## లోక్‌సభ సభ్యుడిగా తెలుగులో ప్రమాణం చేసిన తమిళనాడు ఎంపీ

18వ లోక్‌సభ సమావేశాలు వరుసగా రెండో రోజూ కొనసాగుతున్నాయి. ఎంపీలతో ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయిస్తున్నారు. పలువురు ఎంపీలు తమ తమ మాతృభాషల్లో ప్రమాణం చేస్తున్నారు. అయితే, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ఎంపీ మాత్రం తన మాతృభాష తమిళ్‌లో కాకుండా తెలుగులో ప్రమాణం చేసి ఆశ్చర్యపరిచారు. తమిళనాడులోని కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ కె. గోపినాథ్ ఇవాళ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతిని ఓ చేత్తో పట్టుకుని తెలుగులో ప్రమాణం చేసి ఆశ్చర్యపరిచారు. అయితే, చివర్లో మాత్రం 'జై తమిళనాడు' అంటూ నినదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కృష్ణగిరి జిల్లా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతుంది. ముఖ్యంగా ఈ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమీపంలో ఉంటుంది.

## పట్టాలెక్కనున్న తొలి వందేభారత్ స్లీపర్

**న్యూఢిల్లీ :** మరికొద్ది రోజుల్లో వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కబోతుంది. ఆగస్ట్ 15న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదగా ప్రారంభంకానుంది. ముంబై - న్యూఢిల్లీ మధ్య ఈ రైలు నడవనుంది. బెంగుళూరులో ఈ రైలు తయారీ తుది దశకు చేరుకుంది. మొత్తం 16 కోచ్‌లుండే ఈ రైలులో 10 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, ఒకటి మాత్రం ఫస్ట్ ఏసీ కోచ్‌లతో పాటు సీటింగ్ కమ్ లగేజ్ ర్యాక్ కోచ్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ముంబై - న్యూఢిల్లీ మధ్య




నడిచే రైళ్లకు ప్రయాణికుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉంది. ఆ క్రమంలో ప్రయాణికులు రిజర్వేషన్ లేకుండా రైళ్లలో ప్రయాణించే సందర్భాలు సైతం అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో వందేభారత్ స్లీపర్ రైలును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రైల్వే శాఖ మంగళవారం వెల్లడించింది. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులకు ఈ స్లీపర్ రైలు బాగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడింది. న్యూఢిల్లీ నుంచి బయలుదేరే ఈ రైలు భోపాల్, సూరత్ మీదగా ముంబై చేరుకుంటుందని వివరించింది. మరోవైపు వందేభారత్ స్లీపర్ రైలు మరో రెండు నెలల్లో పట్టాలెక్కనుందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇప్పటికే ప్రకటించారు. ఈ రైలు తయారీపై ఇటీవల బెంగుళూరులో మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులతో సమీక్ష సైతం నిర్వహించారు.

## ఏపీలో బ్లాక్ చేసిన న్యూస్ చానళ్లను పునరుద్ధరించండి


ఏపీలో సాక్షి, టీవీ9, ఎన్టీవీ, 10టీవీ ప్రసారాలను పునరుద్ధరించాలంటూ ఢిల్లీ హైకోర్టు నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఎవరూ అడ్డుకోజాలరని న్యాయస్థానం స్పష్టం చేసింది. బ్లాక్ చేసిన చానళ్లను వెంటనే పునరుద్ధరించి, ప్రసారం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు 15 మంది ఎంఎస్‌ఓలకు ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ హైకోర్టు తీర్పుపై జాతీయ స్థాయి మీడియా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. న్యూస్ బ్రాడ్ కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్ బీఎఫ్), న్యూస్ బ్రాడ్ కాస్టర్స్ అండ్ డిజిటల్ అథారిటీ (ఎన్ బీడీఏ) ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను స్వాగతించాయి. బ్లాక్ చేసిన న్యూస్ చానళ్లను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం అని ఎన్ బీఎఫ్ అభివర్ణించింది. భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం వంటిదని, ఢిల్లీ హైకోర్టు తీర్పుతో ఆ విషయం మరోసారి స్పష్టమైందని వివరించింది. ఆంధ్రప్రదేశ్ లో కొత్త ప్రభుత్వం వచ్చాక



కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపించింది. ఇక, ఎన్ బీడీఏ స్పందిస్తూ... ఏ అంశాలు ప్రసారం చేయాలన్న దానిపై న్యూస్ చానళ్లకు స్వతంత్రత ఉంటుందన్న విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని హితవు పలికింది. మీడియా స్వేచ్ఛలో ఎలాంటి జోక్యాలు ఉండరాదని స్పష్టం చేసింది.

# లోక్‌సభ స్పీకర్‌ను ఎలా ఎన్నుకుంటారు.. కాబోయే స్పీకర్ ఎవరు?

కొత్త లోక్‌సభ కొలువుదీరింది. సోమవారం 18వ లోక్‌సభ తొలి సెషన్ మొదలైంది. సీనియర్ సభ్యుడు భర్తృహరి మహతాబ్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ఆయన ప్రమాణస్వీకారాలు చేయిస్తున్నారు. గత రెండు రోజులుగా ఈ ప్రమాణస్వీకారాలు కొనసాగుతున్నాయి. మంగళవారంతో ఎంపీల ప్రమాణస్వీకారాలు ముగియనున్నాయి. అనంతరం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. అయితే ఎన్డీఏ ఊహించినట్టుగా స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు లేకుండా పోయాయి. అధికార ఎన్డీఏ కూటమి తరపున ఓం బిర్లా నామినేషన్ వేయగా.. ప్రతిపక్ష ఇండియా కూటమి తరపున ఎంపీ కే సురేష్ నామినేషన్ వేశారు. దాంతో దేశ చరిత్రలోనే తొలిసారి లోక్‌సభ స్పీకర్ పదవి కోసం ఎన్నికలు జరుగబోతున్నాయి. రేపు (బుధవారం) ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎన్నిక జరగనుంది. అంతకుముందు ఎప్పటిలాగే స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు ఎన్డీయే చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాగా లోక్‌సభలో అధికార ఎన్డీఏ కూటమికి 293 మంది సభ్యుల బలం ఉండగా, ప్రతిపక్ష ఇండియా కూటమికి 233 మంది సభ్యులు ఉన్నారు. తొలిసారి లోక్‌సభ స్పీకర్ పదవి కోసం ఎన్నికలు జరుగుతుండటంతో.. స్పీకర్‌ను ఎలా ఎన్నుకుంటారు అనే విషయం చర్చనీయాంశంగా మారింది. కొత్త



స్పీకర్‌గా ఎవరు ఎన్నికవుతారనే దానిపై కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా పాత లోక్‌సభ రద్దుకాగానే ఎంపీల పదవీకాలం ముగిసిపోతుంది. కానీ స్పీకర్ పదవి వెంటనే ఖాళీ కాదు. కొత్త లోక్‌సభ తొలి సెషన్ ప్రారంభం అయ్యేదాకా స్పీకర్ పదవీకాలం కొనసాగుతుంది. ఆ తర్వాతే ఆ పదవి ఖాళీ అవుతుంది.

### స్పీకర్ ఎన్నిక ఎలా..?

సోమవారం కొత్త లోక్‌సభ కొలువుదీరగానే 17వ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పదవీకాలం ముగిసింది. స్పీకర్ పదవి ఖాళీ అయ్యింది. దాంతో సీనియర్ సభ్యుడు భర్తృహరి మహతా బ్‌ను నూతన స్పీకర్‌గా నియమించారు. తొలి రెండు రోజులు ఎంపీల ప్రమాణ స్వీకారాలు పూర్తయ్యే వరకు ఆయన ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తారు. ఆ తర్వాత శాశ్వత స్పీకర్ సభను నడుపుతారు. కాబట్టి బుధవారం కొత్త స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. స్పీకర్ ఎన్నికకు ప్రత్యేక రూల్స్ అంటూ ఏమీ లేవు. సభలోని సభ్యులంతా స్పీకర్ ఎన్నిక కోసం జరిగే ఓటింగ్‌లో పాల్గొంటారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారే లోక్‌సభ కొత్త స్పీకర్ అవుతారు. స్పీకర్ పదవికి పోటీపడే అభ్యర్థి కూడా సభలో సభ్యుడై ఉంటే చాలు.. వేరే ఏ ప్రత్యేక అర్హతలు అక్కర్లేదు. అయితే సభలో సంఖ్యాబలం పరంగా చూస్తే అధికార కూటమి బరిలో దించిన ఓం బిర్లానే స్పీకర్ పదవి వరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇండియా కూటమి అభ్యర్థి సురేష్ గెలువాలంటే ఎన్డీఏ కూటమి ఎంపీల ఓట్లు కూడా పడాలి. కానీ అది జరగడం అసంభవమనే చెప్పవచ్చు.

## ఇండియాపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఎన్నిక రేపు జరగనుంది. అటు ఎన్డీయే, ఇటు ఇండియా కూటమి తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. అలాంటి వేళ ఇండియా కూటమిలో చీలిక వచ్చిందా? అంటే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే అలాగే ఉన్నాయనిపిస్తుంది. ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ఎంపీ కె. సురేశ్‌ను కాంగ్రెస్ పార్టీ బరిలో నిలిపింది. అయితే కె. సురేశ్‌ను ఎంపిక చేసి.. బరిలో నిలిపే అంశాన్ని కూటమిలోని ఏ ఒక్కరు తమను సంప్రదించడం కానీ.. తమతో చర్చించడం కానీ చేయలేదన్నారు. ఇది ఏకపక్ష నిర్ణయమని వ్యాఖ్యానించారు. మరోవైపు బుధవారం స్పీకర్ ఎన్నిక నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ఈ రోజు రాత్రి 8.00 గంటలకు ఇండియా కూటమి భాగస్వామ్య పక్ష పార్టీల నేతలు భేటీ కానున్నారు. ఈ భేటీకి తాము హాజరుకావడం లేదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. మరోవైపు ఇదే విషయాన్ని పార్లమెంట్ వద్ద మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ మంగళవారం పేర్కొన్నారు. ఇక లోక్‌సభ స్పీకర్ ఎన్నిక నేపథ్యంలో స్పీకర్ అభ్యర్థి ఓం బిర్లా కోసం ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు 10 సెట్ల నామినేషన్లు వేశాయి. అలాగే కె.సురేశ్ తరఫున కేవలం 3 సెట్ల నామినేషన్లు ఇండియా కూటమి వేసింది.


## ప్రజలకు మేలు చేయడమే అజెండాగా పనిచేస్తాం : డింపుల్ యాదవ్

ఎస్పీచీఫ్ అఖిలేష్‌యాదవ్ సతీమణి ఆ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ మంగళవారం 18వ లోక్‌సభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజలకు వీలైనంత మేర సేవ చేయడమే తమ




ప్రధాన అజెండా అని పేర్కొన్నారు. మరోవైపు విపక్ష ఇండియా కూటమి నుంచి పలువురు ఎన్డీయేలోకి వస్తారని ఎన్సీపీ ఎంపీ ప్రఫుల్ పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంతమంది ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పి ఇక్కడకు వస్తారనేది కాలమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ఇండియా కూటమి వాపు ఎంత అనేది కాలమే నిర్ణయిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. పాలక పక్షానికి చెందిన సభ్యుడే స్పీకర్ కావడం అనే ఆనవాయితీ కొనసాగుతున్నదని చెప్పారు. ఎలాంటి వివాదం లేకుండా స్పీకర్‌ను ఎన్నుకుంటే సభలో మెరుగైన వాతావరణం ఉంటుందనే ఒరవడి ఇప్పటివరకూ కొనసాగిందని గుర్తుచేశారు.

## జూలైలో రష్యాలో పర్యటించనున్న మోదీ..



**మాస్కో:** ప్రధాని నరేంద్ర మోదీ వచ్చేనెలలో రష్యాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. క్రెమ్లిన్‌కు చెందిన అధికారి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించినట్లు రష్యాకు చెందిన ఆర్‌ఐఏ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. జూలైలో మోదీ రష్యాలో పర్యటించనున్నట్లు దౌత్యవర్గాల ద్వారా వెల్లడైనట్లు ఆర్‌ఐఏ చెప్పింది. రష్యాలో విజిట్ చేసేందుకు మోదీకి ఓపెన్ ఇన్విటేషన్ ఉన్నట్లు ఇటీవల క్రెమ్లిన్ పేర్కొన్న విషయం తెలిసిందే. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను మోదీ కలుసుకునే అవకాశాలు ఉన్నాయి. మాస్కోలో పుతిన్‌ను మోదీ కలుస్తారని తాజాగా రిలీజైన ప్రెస్ రిలీజ్ ద్వారా తెలుస్తోంది. అయితే వీరి భేటీకి చెందిన కచ్చితమైన తేదీని ఇంకా వెల్లడించలేదు. కానీ జూలై 8వ తేదీన ఈ భేటీ జరిగే అవకాశాలు ఉన్నట్లు కొన్ని కథనాల ద్వారా తెలుస్తోంది. పుతిన్ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి యూరి ఉషోకోవ్ మాత్రం దీనిపై ఇంకా ప్రకటన చేయలేదు. ఈ ఏడాది బ్రిక్స్ నేతల సమావేశాల్లోనూ ఇద్దరూ కలుసుకోనున్నట్లు భావిస్తున్నారు. కచన్ నగరంలో ఈ సమ్మిట్ జరగనున్నది. గత ఏడాది డిసెంబర్‌లో విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యాలో పర్యటించారు. ఆ సమయంలో మోదీకి పుతిన్ ఆహ్వానం అందించినట్లు తెలుస్తోంది.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ

ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ట్రయల్ కోర్టు తీర్పుపై స్టే విధించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు కీలక తీర్పు వెలువరించింది. కోర్టు నిర్ణయం నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతానికి జైల్లోనే ఉండాల్సి



రానున్నది. బెయిల్ పిటిషన్‌పై ఇచ్చిన స్టేను ఎత్తివేసేందుకు నిరాకరించింది. బెయిల్‌పై స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వు లోపభూయిష్టంగా ఉందని.. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వొద్దంటూ ఈడీ కోర్టును కోరింది. ఈ నెల 20న రౌస్ అవెన్యూ కోర్టు సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21న కోర్టు నిర్ణయాన్ని ఈడీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ అభ్యర్థన మేరకు కోర్టు స్టే విధించింది. గతవారం వెకేషన్ జడ్జి జస్టిస్ జూన్ శుక్రవాం ఈడీ పిటిషన్‌ను విచారించారు. స్టే దరఖాస్తుపై తీర్పును రిజర్వ్ చేస్తూ.. హైకోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు ఇంప్లీడ్ ఆర్డర్‌పై స్టే ఇచ్చారు. దీంతో మధ్యంతర స్టేను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను జస్టిస్ మనోజ్ మిశ్రా నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల ఇచ్చే వరకు వేచి ఉండాలని సూచించింది. రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి బిందు జారీ చేసిన బెయిల్ ఆర్డర్‌లో ఈడీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్‌పై ఈడీ పక్షపాతంతో వ్యవహరిస్తుందని అభిప్రాయపడ్డారు. నేరం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించి ఈడీ ప్రత్యక్ష సాక్షాలను చూపలేదని పేర్కొంది.

# జూలైలో కేబినెట్ విస్తరణ

-మొదటిపేజీ తరువాయి

ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రభుత్వ ఏర్పాటు తర్వాత? కీలక నేతలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఖాళీలను కూడా భర్తీ చేయాలని భావించినప్పటికీ లోక్ సభ ఎన్నికల కోడ్ వచ్చేసింది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం?. ఎన్నికలపై ఫోకస్ పెట్టాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాలు రావటంతో మళ్లీ పాలనపై ఫోకస్ పెట్టింది ప్రభుత్వం. ఇదే సమయంలో పూర్తిస్థాయి కేబినెట్ టీమ్ తో ముందుకెళ్లాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇక నామినేటేడ్ పోస్టులను కూడా భర్తీ చేయాలని యోచిస్తున్నారు. మంత్రి వర్గంలో చోటు కోసం చాలా మంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరు స్థానాలు మాత్రమే ఖాళీ ఉండగా? వీటి కోసం చాలా మంది నేతలు రేసులో ఉన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేలు కూడా వీటిని ఆశిస్తున్నారు. మరికొంతమంది ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫలితంగా ఆయా జిల్లాల్లో సమీకరణాలు మారిపోతున్నాయి. దీంతో కేబినెట్ లో ఎవరికి చోటు దక్కబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత కేబినెట్ లో నాలుగు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించలేదు. విస్తరణలో ఆ నాలుగు జిల్లాలకు కచ్చితంగా చోటు కల్పించాల్సి ఉంటుందన్న చర్చ గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుత మంత్రివర్గంలో రెడ్డి సామాజిక వర్గం నుంచి నలుగురు మంత్రులు ఉన్నారు. బీసీ, ఎస్సీ సామాజికవర్గాల నుంచి ఇద్దరు ఉండగా? ఎస్టీ, కమ్మ, వెలమ సామాజికవర్గాల



నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. అయితే విస్తరణలో కూడా సామాజిక సమీకరణాలు కీలకంగా ఉంటాయని తెలుస్తోంది.ప్రస్తుత కేబినెట్ లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి ఎవరూ లేరు. అయితే ఇటీవలే బీఆర్ఎస్ కు చెందిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఇక్కడ సీన్ మారిపోయింది. కేబినెట్ రేసులో ఆయన కూడా ఉన్నారన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇదే జిల్లా నుంచి మదన్ మెహన్ తో పాటు సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి రేసులో ఉన్నారు.కేబినెట్ లో చోటు కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి జి. వివేక్, ప్రేమ్ సాగర్ రావు రేసులో ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి మాత్రమే ఛాన్స్ దక్కే అవకాశం

ఉంది.గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒకరికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు లేరు. తాజాగా కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచి మాత్రమే ఖాతా తెరిచింది. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పార్టీలో చేరారు. ఆయన సిటీ నుంచి కేబినెట్ బెర్త్ ను కోరుతున్నారు. ఆయనే కాకుండా పలువురు నేతలు కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు.విస్తరణలో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ బెర్త్ దక్కే అవకాశం ఉందన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ కోణంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఆయనకు ఖరారయ్యే అవకాశం ఉందంటున్నారు.ఇక ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మరో ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు కల్పించే ఛాన్స్ ఉంది. అయితే ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యేతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేతలు కావటంతో?. వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చున్న టాక్ కూడా వినిపిస్తోంది. ప్రస్తుత కేబినెట్ లో మైనారీవర్గాలకు చెందిన మంత్రి లేరు. దీంతో విస్తరణలో తప్పకుండా మైనార్టీ కోటా నుంచి ఒకరికి ఛాన్స్ దక్కటం ఖాయంగా కనిపిస్తోంది. పీసీసీ చీఫ్ గా బీసీ వర్గానికి చెందిన నేతకు ఇచ్చే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. దీనిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది?!

# ముందుకు సాగని మహాలక్ష్మి?

-మొదటి పేజి తరువాయి

కానీ ఈ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం షాకింగ్ న్యూస్ తెలిపింది. అదేంటంటే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల పథకాలపై దృష్టి పెట్టింది. వీటిలో కొన్ని ఇప్పటికే అమలు చేసింది. ఇటీవల రుణ మాఫీ కోసం కసరత్తు పూర్తి చేస్తారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2 లక్షల వకు రుణమాఫీ చేయనున్నారు. దీని తరువాత కాంగ్రెస్ ప్రకటించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500 సాయం గురించే ఆలోచిస్తారన్న చర్చ ప్రారంభమైంది. అయితే ఇటీవల జరిగిన సమావేశాలు, విధి విధానాలు చూస్తే ఈ పథకం ఇప్పట్లో ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.ప్రస్తుతం రైతు రుణ మాఫీపై తీవ్రంగా కృషి చేస్తున్నారు. దీని కోసం రూ.40 వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం తరువాత కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. అయితే గతంలో లాగా రేషన్ కార్డులను అనర్హులకు కాకుండా అసవరమైన వారికే ఇవ్వాలని అనుకుంటున్నారు. ఇందులో భాగంగా ముందుగా సర్వే చేసిన తరువాత కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించనున్నారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తియిన తరువాతే మహాలక్ష్మి (రూ.2,500) స్కీంను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.

మహాలక్ష్మి పథకం గురించి ఓ న్యూస్ మహిళలకు షాక్




ఇచ్చినట్లయింది. రూ.2,500 సాయం మొత్తాన్ని అందరికీ కాకుండా కొందరికీ మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆసరా పింఛన్లు, బీడీ కార్మికులకు కాకుండా కొత్త వారికి ఇవ్వాలని అనుకుంటోంది. అంతేకాకుండా ఉద్యోగాలు చేస్తున్న వారిని కూడా ఇందులో మినహాయించే అవకాశం ఉంది. అంటే ఈ ప్రక్షాళన తరువాత ఎలాంటి ఆదాయం వచ్చే పనులు చేయడంగా గృహిణులుగా ఉన్న వారికి మాత్రమే ఈ సాయం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ చేద్దాం

-మొదటిపేజీ తరువాయి

అనంతరం మీడియాతో ఈ సమీక్షలో చర్చించిన విషయాలను మీడియాకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేద్దామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలు ఏంటి.. అందుకు గల కారణాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటల భీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు. రాబోయే సీజన్‌కు పంటల భీమాకు సంబంధించి పిలవాల్సిన టెండర్లపై చర్చించారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, ఇప్పటికీ కళాశాలలు లేని జిల్లాల వివరాలను డిప్యూటీ సీఎం సమావేశంలో తీసుకున్నారు. సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలలో విత్తన అభివృద్ధి తీరుపై చర్చించారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాం.. అయితే వ్యవసాయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల పైన దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే ఉత్పత్తుల పెరిగి రాష్ట్ర ఖజానాకు , రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చే రంగాలు.. ప్రభుత్వం తదితర రంగాలపై చేస్తున్న ఖర్చులను డిప్యూటీ సీఎం అధికారుల ద్వారా విచారించారు. ఇక రైతు భరోసాకు సంబంధించి



రైతుల అభిప్రాయం ఎలా ఉంది, ఏ విధంగా ముందుకు పోతే మంచిదనే విషయాలను రైతుల ద్వారానే తెలుసుకుంటే మంచిదని .. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ చేసి రైతులను భాగస్వాములను చేయాలని, అందులో మంత్రులు కూడా పాల్గొంటే కార్యక్రమం మరింత ప్రయోజనాత్మకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తపరిచారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా పథకాలకు ఇప్పటివరకు చేస్తున్న ఖర్చు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రాబోయే రోజుల్లో పెరుగుతున్న బడ్జెట్‌పై సమీక్ష చేశారు. ఆయిల్ ఫామ్ సాగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలపై చర్చించారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న భీమా పథకాలు ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో వచ్చిన మార్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను విచారించారు. సిరిసిల్ల కో-ఆపరేటివ్ సొసైటీ, టెక్స్ టైల్ వ్యాపారస్తులు ప్రభుత్వం నుంచి ఏ పద్ధతిలో ప్రయోజనం పొందుతున్నారు తదితర వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో మ్యాచింగ్ ద్వారా వచ్చే పథకాలు, నిధులు సద్వినియోగం చేసు కోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులకు తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, ఆర్థిక శాఖ అడిషనల్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాలి

హైదరాబాద్ : బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి సభ్యత్వాలు రద్దు కావాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్‌ను సమయం కోరాం. వెసులుబాటు చూసుకొని సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. స్పీకర్ న్యాయంగా సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. అనర్హత పిటిషన్లపై ఈ నెల 27న హైకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్ ది ఒక విధానం.. రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ. బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని జగదీశ్ రెడ్డి ఆగ్రహం



వ్యక్తం చేశారు. బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## సేమ్... సీన్...

## పార్టీలు మార్పు అంతే

-మొదటిపేజీ తరువాయి

అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇబ్బందులను కోరి తెచ్చుకుంటున్నామని మర్చిపోతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా వారిపై ఎన్నికల్లో పోటీచేసి ఓడి పోయినవారిపై ప్రభావం పడుతోంది. ఎమ్మెల్యేల చేరికతో వారి అనుచరులు కూడా అధికార పార్టీలోకి వస్తారు. దీంతో గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి పనిచేసిన వారే ఇప్పుడు జై కాంగ్రెస్ అనాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారికి, కొత్తగా పార్టీలోకి చేరిన వారి మధ్య పోటీ నెలకొంటుంది. నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడతారు. ఇది పాత కొత్త నేతల మధ్య వైరానికి దారితీయడం ఖాయంఅధికార పార్టీలో చేరుతున్నవారు.. చేర్చుకుంటున్నవారు ఇద్దరూ నైతికతకు తిలోదకాలు ఇస్తున్నారు. రాజకీయాల్లో ఇప్పుడు ఆ పదానికే స్థానం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా చేరినవారితో ప్రభుత్వం స్థిర పడొచ్చు. కానీ, పార్టీ పరంగా మాత్రం ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో ప్రభుత్వం పడిపోతుంది.. కూలుస్తాం అన్న నేతలు కూడా ఇప్పుడు అధికార పార్టీలో చేరుతున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరని కాంగ్రెస్ పార్టీనేతలు గొప్పగా చెబుతున్నారు. గతంలో ప్రభుత్వాన్ని కూలుస్తామన్నందుకు ప్రతీకారం తీర్చుకుంటున్నట్లుగా చేరికలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది. కానీ, కేసీఆర్ అనుచరులను చేర్చుకోవడం ద్వారా ముప్పు తెచ్చుకుంటున్నామన్న విషయం మర్చిపోతున్నారు.చేరికలను కాంగ్రెస్ గొప్పగా అనుకుంటోంది. కానీ అది కాంగ్రెస్ గొప్ప కాదు.. అధికారం గొప్ప అన్న విషయం విస్మరిస్తోంది. కాంగ్రెస్ విపక్షంలో ఉన్నప్పుడు ఒక్కరు కూడా చేరలేదు. ఇప్పుడు చేరుతున్నారంటే అది అధికారం గొప్పదనమే. ఇప్పుడు చేరిన వారు, చేరుతున్న వారు కూడా అధికారం అనుభవించడానికే. ఎన్నికల సమయంలో టికెట్ ఇస్తేనే పార్టీలో ఉంటారు. లేదంటే మళ్లీ వారు కేసీఆర్ పంచనో.. ఇంకో పార్టీలో కేరడం ఖాయం. ఇలాంటి చేరికతలో బీఆర్ఎస్ ఇప్పుడు బాగా నష్టపోవచ్చు.. కానీ రేపు కాంగ్రెస్‌కు కూడా ఇదే పరిస్థితి రావొచ్చు.

## బీఆర్ఎస్ మరాఠ ఫార్మాలా

హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని రాజకీయ పార్టీలు పదే పదే చెబుతున్నాయి. దీంతో ఎమ్మెల్యేలుగా గెలుపొందినవారిలో చాలామంది కారు దిగిపోయారు. తమకున్న పరిచయాలతో కాంగ్రెస్, బీజేపీ వైపు వెళ్లిపోతున్నారు. మరికొందరు పుట్టింటికి అంటే టీడీపీలోకి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అధికారం లేకుంటా ఐదేళ్లపాటు కేడర్‌ని కాపాడుకోవడం కష్టమని అంటున్నారు. ఈ క్రమంలో ఎవరి నచ్చని పార్టీలోకి వారు వెళ్లిపోతున్నారు.ఎమ్మెల్యేలు పార్టీ నుంచి వెళ్లిపోతున్నారన్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కీలక నేతలు వారిలో మంతనాలు సాగిస్తున్నారు. రాబోయే రోజుల్లో పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని చెబుతూ వాళ్లని కన్వీన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయినా సరే చాలా మంది కారు దిగిపోతున్నారు. ఈ క్రమంలో పార్టీ మారుతున్న ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు ఆ పార్టీ సిద్ధమవుతున్నట్లు ఓ ఫీలర్ బయటకు వచ్చింది. ఈ విషయమై న్యాయ నిపుణులతోనూ ఆ పార్టీ చర్చించింది.గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో అనర్హత పిటిషన్‌పై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని గులాబీ పార్టీ చెబుతోంది. తీర్పులోని పేరా నెంబర్ 30, 33 ప్రకారం హైకోర్టు వెంటనే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఎమ్మెల్యేలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీలో సగానికి పైగా ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా స్పీకర్ లేఖ ఇస్తే.. బీఆర్ఎస్ పార్టీ ఉనికి పోతుందని అంటున్నారు. తద్వారా బీఆర్ఎస్‌కు గుర్తు పోతుందని, మొదటికే ముప్పు వస్తుందని అంటున్నారు.మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలను చీల్చింది బీజేపీ పార్టీ. దీంతో ఆయా పార్టీలు గుర్తులు సైతం కోల్పోయాయి. ఒకవేళ బీఆర్ఎస్ గనుక న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే మహారాష్ట్ర ఫార్ములాను అమలు చేయాలని సగానికిపైగానే ఎమ్మెల్యేలు చర్చించుకుంటున్నారు. మొత్తానికి బీఆర్ఎస్ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నచందంగా మారింది.

## తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారాన్ని తిలకించిన రేవంత్ రెడ్డి

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించిన కోమటిరెడ్డి, గడ్డం వివేక్ కూడా

లోక్ సభ గ్యాలరీలో సోనియాను కలిసిన రేవంత్ రెడ్డి

తెలంగాణకు నిధుల కోసం నడ్డాను కలుస్తానని మీడియాతో సీఎం

పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిలకించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వివేక్ తెలంగాణ ఎంపీల ప్రమాణాన్ని వీక్షకుల గ్యాలరీ నుంచి చూశారు. లోక్ సభ గ్యాలరీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీని కలిశారు. పార్లమెంట్‌లోనికి వెళ్లడానికి ముందు ఆయనను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. పార్లమెంట్‌లో కేంద్రమంత్రి జేపీ నడ్డాను కూడా కలుస్తానని చెప్పారు. తెలంగాణకు సంబంధించి పలు ఇష్యూలు ఉన్నాయని, గత ప్రభుత్వ హయాంలో తమకు నిధులు విడుదల కాలేదని, వాటి విడుదల కోసం నడ్డాను కలుస్తున్నట్లు చెప్పారు.

## ఎవరూ తొందరపడొద్దు



-మొదటిపేజీ తరువాయి

కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, నాయకులు క్యామ మల్లేశ్, రావుల శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి లంచ్ చేసిన కేసీఆర్.. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఎవరూ తొందరపడొద్దని సూచించారు.

ఇలాంటి పరిణామాలు ఆనాటి వైఎస్ హయాంలోనే జరిగాయని.. అయినా మనం భయపడలేదని కేసీఆర్ గుర్తు చేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. రేపట్నుంచి వరుసగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. భవిష్యత్తులో మనకు మంచి రోజులు వస్తాయని తెలిపారు.

వైఎస్ హయాంలో ఇలాంటివి ఎన్ని జరిగినా భయపడలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో తరుచూ సమావేశమవుతానన్నారు. ఈ భేటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, ఇతర సీనియర్ నేతలు భేటీ అయ్యారు. వారితో కలిసి కేసీఆర్ లంచ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఎవరూ తొందరపడొద్దని సూచించారు.

# అమరవీరుల స్థూపం, కేశ్లాపూర్ నాగోబా టెంపుల్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి

**- జిల్లా పాలనాధికారి రాజర్షి షా**

**వాస్తవ నేస్తం ఆదిలాబాద్:** ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఛాంబర్ లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. అమరవీరుల స్థూపం, కెస్లాపూర్ నాగోబా దేవాలయాల నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రెండింటి నిర్మాణ పనుల కు రెండు కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్థూపం వద్ద కాంపౌండ్ వాల్, బోర్ వెల్, పంప్ సెట్, స్ట్రీట్ లైట్స్, షెడ్స్, స్తూపం చుట్టూ స్టెప్స్, తదితర నిర్మాణ పనులు అలాగే నాగోబా దేవాలయ నిర్మాణ పనుల్లో కమ్యూనిటీ హాల్, టాయిలెట్స్ , బోర్ వెల్, పంప్ సెట్స్, స్టెప్స్, విద్యుత్ దీపాలు, తదితర పనులు సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి సంబందించి అగ్రిమెంట్ జరిగి 15 రోజులు గడుస్తున్న ఇంకా పనులు ఎందుకు ప్రారంభించలేదన్నారు. ఎక్కువ మంది లేబర్లతో త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్ ని ఆదేశించారు.



ఉట్నూర్ మండల పరిధిలోని అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార చేపడుతున్న నిర్మాణ పనులు, అడిషనల్ క్లాస్ రూమ్ లు, ఏకరూప దుస్తులు, ఐటిడిఏ ద్వార మేజర్ వర్క్స పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి మరమ్మత్తులను పరిశీలించిన జిన్నారం ఎంపీపీ



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం శివనగర్ నుండి కంజర్ల వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమై బస్సులు రాక ప్రజలకు విద్యార్థిని విద్యార్థులకు రవాణా సంస్థలకు తీవ్ర ఇబ్బంది కలగడంతో జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ క్రషర్ యాజమాన్యాలతో మాట్లాడి రహదారి మరమ్మత్తులను చేయించారు. మరమ్మత్తుల పనులతో శివనగర్ రాలకత్వ సొలక్ పల్లి నర్సాపూర్ వెళ్లే ప్రజలు విద్యార్థిని విద్యార్థులు వాహనదారులు ఎంపీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల మహేష్, జింకల రవి, సత్యనారాయణ, రవీందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఆలయంలో బోనాల ఏర్పాట్లపై సమీక్ష

**హైదరాబాద్ :** బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం బోనాల నేపథ్యంలో అమ్మవారి కళ్యాణోత్సవ ఏర్పాట్లపై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

## బొంతపల్లిలో వాడి వేడిగా గ్రామసభ

### - అభివృద్ధి పనులు జరగడంలేదని నిలదీత



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** శాసనసభ ఎన్నికలు జరిగి దాదాపు ఆరు నెలలు గడిచిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలో మంగళవారం మండల పరిషత్ ప్రత్యేక అధికారి మరియు గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో గ్రామ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,వార్డు సభ్యులు,యువజన సంఘాల నాయకు లు, యువకులు ఆశాలు,ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల నుండి ఎటువంటి పనులు జరగడం లేదని ఇదివరకే ప్రపోజల్ లో ఉన్న ప్రైమరీ పాఠశాలలోని నీళ్ళ సమస్యను మరియు గ్రామంలో వీది లైట్ దీపాలను,సీసీ కెమెరాలు,పలుచోట్ల పెండింగ్ ఉన్న సిసి రోడ్లను, ఎస్సీ వాడలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లను తొలగించాలని, వీరభద్ర నగర్ కాలనీలో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న అండర్ డ్రైనేజ్ సమస్యను అలాగే గల్లీలలో ఉంటున్న బ్యాచిలర్స్ వల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయని, ముఖ్యంగా గ్రామంలో పదవ తరగతి చదివిన తర్వాత బయటకు వెళ్లి చదవలేని విద్యార్థిని,విద్యార్థులు ఇంటి వరకే పరిమితం కావడంతో అలాంటి వారికోసం ఇక్కడే ఉండి చదివేలా ఇంటర్ మరియు డిగ్రీ కళాశాల కావాలని,ప్రభుత్వ భూములను కాపాడాలని వాటిని ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇప్పుడు రానున్నది వర్షాకాలం కాబట్టి పరిశుభ్రతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

**ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ..**

మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ మా వరకు వచ్చిన సమస్యలను ముఖ్యంగా నీటి,వీధి దీపాలు, పాఠశాలలో ఉన్న సమస్యలను మరియు పరిశుభ్రత, బ్యాచిలర్ గా ఉంటున్న వారిపై అసాంఘిక కార్యకలాపాలను చేసేవారిపై ప్రత్యేక దృష్టి సారించాలని. ఉన్న సమస్యలను గ్రామ పెద్దలతో కలిసి వాటిని వెంటనే తీరుస్తామని తెలియజేశారు.

# చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు

**ఎమర్జెన్సీ పాలన దేశానికి ఓ మాయని మచ్చ**

**దేశ ప్రజల గొంతు నొక్కి కాంగ్రెస్ చేసిన అరాచకాలకు నిదర్శనం**

**కాంగ్రెస్ అధికార దాహానికి ఎమర్జెన్సీ నిదర్శనం**

**ఇందిరను మించిన దురాలోచన రాహుల్ గాంధీది**

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్ :** దేశంలో ఎమర్జెన్సీ పాలనకు నేటికి 50 ఏళ్లు. 1975 జూన్ 25 నుండి 21 నెలలపాటు ఎమర్జెన్సీ పాలన పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశ ప్రజల గొంతును నొక్కేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార దాహానికి ఎమెర్జెన్సీ పాలన ఓ నిదర్శనం. అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ విరుద్దంగా ఎన్ని అడ్డదారులైన తొక్కేందుకు, చివరకు ప్రజల ప్రాణాలను తీసేందుకు, ప్రజ్వాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వెనుకాడదనే దానికి ఎమర్జెన్సీ పాలనే ఓ ఉదాహరణ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమెర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిపక్ష నాయకులను, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, జనసంఘ్ నాయకులను మీసా కింద జైళ్లలో పెట్టారు. పత్రికలపై సెన్సార్ విధించారు. పౌరుల ప్రాథమిక హక్కులను హరించారు. మానవ హక్కులను, స్వేచ్ఛను హరించి వేశారు. ప్రశ్నించిన ఎంపీల సభ్యత్వాన్ని కూడా రద్దు చేసిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే. తెలుగు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన డీఎస్పీ రెడ్డి జంగారెడ్డి, వి.రామారావు , జూపూడి యజ్ఞ నారాయణ, పీవీ చలపతి రావు , వెంకయ్య నాయుడు, సీహెచ్ విద్యాసాగర్ రావు , ఇంద్రసేనారెడ్డి , అశోక్ యాదవ్, తదితర ఏబీవీపీ, జనసంఘ్ కార్యకర్తలతో పాటు చాలా మంది సంఘ్ పరివార్ కార్యకర్తలను అరెస్ట్ చేసిన చరిత్ర కాంగ్రెస్ దే. ఎమెర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ బృందం చేసిన అరాచకాలకు అంతులేదని అన్నారు. ఎమర్జెన్సీ పాలనతో విసిగిన ప్రజలు కాంగ్రెస్ ను ఓడించినా, ఆ పార్టీ నేతల్లో మార్పు రాకపోవడం సిగ్గు చేటు. కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కాంగ్రెస్ కూలదోసింది. 1947 నుంచి 2014 వరకు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కాంగ్రెస్ ఏకంగా 90 సార్లు ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసింది. అబద్ధాలను ప్రజల్లోకి ప్రచారం చేయడం, ఎన్నికల యంత్రాం గంపై నిరాధార ఆరోపణలు, మైనారిటీల బుజ్జగింపు, ఓటుబ్యాంకు రాజకీయాలు, విభజన రాజకీయాలు, ఎన్నికల హింస, ఓటర్లను ప్రలోభ పెట్టడం, రాజ్యాంగం దాని సూత్రాల పట్ల గౌరవం లేకపోవడం వంటివి కాంగ్రెస్ లక్షణాలని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తారుమారు చేస్తుందని, రిజర్వేషన్లను నాశనం చేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ఓట్లు పొందాలని చూసిన కాంగ్రెస్ కు దేశ ప్రజలు తగిన బుద్ది చెప్పినా ఆ పార్టీ నేతలు మారలేదు. ఈ విషయంలో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరాగాంధీని మించి పోయారు. భారతదేశాన్ని అస్థిరపరచడంలో, బలహీనపరచడంలో విదేశీ శక్తుల పాత్ర ఉందనే సాకుతో అధికారాన్ని నిలుపుకునేం దుకు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధిస్తే.. అధికారం కోసం ఆయన మనవడు రాహుల్ గాంధీ వివిధ దేశాల్లో పర్యటిస్తూ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది అనే ముసుగులో భారత్ లో పాశ్చాత్య దేశాల జోక్యం అవసరమంటూ నిస్సిగ్గుగా వేడుకుని దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నించారు. ఇకనైనా కాంగ్రెస్ కుటిల రాజకీయాలను, చీకటి ఒప్పందాలను వీడి ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడాలి. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై అర్థవంతంగా చర్చ జరిగేందుకు సహకరించాలి. వాటికి పరిష్కార మార్గాలను సూచించాలని కోరుతున్నానని అన్నారు.

## బట్టాపూర్‌లో అక్రమ ఇసుక డంపులు స్వాధీనం



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని బట్టాపూర్ గ్రామంలో అక్రమ ఇసుక నిల్వలు ఉన్నట్లు సమాచారం అందడంతో విచారణ కొరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ గ్రామ శివారులోని ఊరగుట్ట వద్ద సుమారు 50 ట్రాక్టర్ల అక్రమ ఇసుక డంపులను గుర్తించి నట్లు తహసీల్దార్ యూసూఫ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇట్టి ఇసుక డంపులను స్వాధీనపర్చుకున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉదయం మండల కేంద్రములోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 10 గంటల వరకు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### - ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ మన్నూరు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరమైనది, నాణ్యమైనది అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం భోజనం వంట చేసే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చ టిస్తూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఉన్నత స్థానాలకు ఎదిగి పాఠశాలకు తమ తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తేవాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కేంద్రే జ్ఞాను, నాయకులు తిరుమల గౌడ్,పాండురంగ్ తదితరులు ఉన్నారు.

## బీఎస్ఎన్ఎల్ ట్యాక్సీ స్టాండ్ యూనియన్ అధ్యక్షుడిగా గరిడేపల్లి రమేష్



**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ టాక్స్ స్టాండ్ యూనియన్ అధ్యక్షుడిగా గరిడేపల్లి రమేష్ గెలుపొందారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికలలో మొత్తం పోలింగ్ అయిన ఓట్లు 131 కాగా ప్రత్యర్థి పై 102 ఓట్ల మెజారిటీతో రమేష్ గెలుపొందారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి సభ్యుడికి రుణపడి ఉంటానని అన్నారు. యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం అధ్యక్షుడిగా గెలుపొందిన గరిడేపల్లి రమేష్ కు ధర్మపురి ఉపేంద్ర చారి మరియు యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి సంబరాలు జరుపుకున్నారు.

## సెంట్రింగ్ యూనియన్ తరపున మేస్త్రి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన సిరుమని సహదేవ్ శుక్రవారం బైక్ పై వెళ్తున్న క్రమంలో ప్రమోదవశాత్తు మెస్త్రి సిరుమని సహాదేవ్ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి శ్రీ కనకదుర్గ సెంట్రింగ్, తాపిమెస్త్రి యూనియన్ తరపున రూ 25000/లు యూనియన్ తరపున వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చెంద్రయ్య, ఉపాధ్యాయులు వెంకటేష్, రవి, అశోక్, యాదగిరి, మురళి, సతీష్, చిరంజీవి, నీలం నర్సింలు, జగంపేట సాయిలు, తదితరులు పాల్గొన్నారు

## వీధి దీపాలు ప్రారంభించిన జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాల గ్రామంలో పీర్ల చెరువు కట్టపై వీధి దీపాలను గ్రామస్తులతో కలిసి జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. వావిలాల జంగంపేట్ జిన్నారం గ్రామాల రాకపోకలపై వాహనదారులకు పాదచారులకు రైతులు ఆనంద వ్యక్తం చేశారు. ఎన్నో రోజుల కలను జిన్నారం ఎంపీపీ సహకారంతో స్ట్రీట్ లైట్ ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. వీది దీపాలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఎంపీపీకి వావిలాల జంగంపేట జిన్నారం వివిధ గ్రామాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ గ్రామ అద్యక్షులు బూమని వెంకటేష్, మాజీ వార్డ్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ప్రకాష్ గౌడ్, భిక్షపతి, కుమారి శీను, వాళ్యోదీన్, ప్రవీణ్,వీరేష్, కృష్ణ, గ్రామ పెద్దలు నాయకులు యువకులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com